TGTEL/26/A4985

# ఆదాబ్ సైబరాబాద్

# ADAAB CYBERABAD

www.adaabcyberabad.com
epaper.adaabcyberabad.com
adaabcyberabad@gmail.com

ఎడిటర్ : బిల్లాల్‌పూర్‌సారా శివ కుమార్ | సంపుటి : 1 | సంచిక : 16 | గురువారం, జూలై 30, 2026 | పేజీలు - 4 | వెల: 5/-

EDITOR : BILLALPURSARA SHIVA KUMAR | VOLUME : 1 | ISSUE: 16 | 30-07-2026 (THURSDAY) | PAGES: 4 | RS : 5/-

### కాళేశ్వరం నుంచి నీటి చుక్క వాడకుండా

## అత్యధిక ధాన్యం పండించిన తెలంగాణ



హైదరాబాద్, జులై 29 కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటి చుక్క కూడా వాడకుండా భారతదేశంలోనే అత్యధికంగా ధాన్యం పండించిన రాష్ట్రం తెలంగాణ అని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన బుధవారం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టిన వారం రోజుల్లోనే లీక్ అయిందన్నారు. ఈ విషయం బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కి కూడా తెలుసునని పేర్కొన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణారెడ్డి సహా అధికారులపై చర్యలు తీసుకోవాలని చెప్పినా పట్టించుకోలేదని అన్నారు. సుమారు మూడేళ్లుగా నిరుపయోగంగా ఉన్న ప్రాజెక్టుకు రూ.16 వేల కోట్ల వడ్డీ రూపంలో కడుతున్నామని వివరించారు. కాళేశ్వరంపై బీఆర్ఎస్ పార్టీ పిచ్చి రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. కానీ ఆ ప్రాజెక్ట్‌తో తాము అలాంటి రాజకీయాలు చేయడం లేదన్నారు. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ బాధ్యత లేకుండా మాట్లాడడం దురదృష్టకరమని అన్నారు. ఇసుకలో కాళేశ్వరం ఫౌండేషన్ వేశారని గుర్తు చేశారు. ఐఐటీ బాంబే ఆఫ్రి కంపెనీతో సాయిల్ టెస్ట్ చేయించామని పేర్కొన్నారు. బ్యారేజీలు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నాయని.. అంటే అది ఓపెన్ చేస్తే ప్రజలకు ఏమైనా అయితే ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ కక్కుర్తి, అసమర్థత వలన కాళేశ్వరం కూలిపోయిందని విమర్శించారు. అయితే కాళేశ్వరం విషయంలో తమకు రాజకీయ దురుద్దేశం లేదని స్పష్టం చేశారు.కాళేశ్వరం విషయంలో బిఆర్ఎస్ పార్టీ బూటకపు ప్రచారం చేస్తుందని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజ్ నుంచి కన్నెపల్లి పంపు హౌస్‌కు18 కిలోమీటర్ల దూరం ఉందన్నారు. అన్నారం బ్యారేజ్‌కి రంధ్రాలు ఉన్నాయని జబ్రొ=హా రిపోర్ట్ ఇచ్చిందని గుర్తు చేశారు. చీణూహా మొదట ప్రిలిమినరీ రిపోర్ట్ నవంబర్ 23 ఇచ్చిందని ప్రాజెక్ట్ నిర్మించారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌కు రూ. 1400 కోట్లు కాళేశ్వరం కాంట్రాక్టర్లు చెక్ రూపంలో ఇచ్చారని కల్వకుంట కవిత చెప్పారని..అది వాస్తవమని పేర్కొన్నారు.తనకు రిమేఘా సంస్థకు ఇవ్వలేదన్నారు. ఎన్డీఎస్ఏ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా సీబీఐకి లేఖ రాశామని చెప్పారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి 24 గంటల్లో సీబీఐ విచారణ జరిపిస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. ధాన్యం కుంభకోణం చేసిన వారిని అరెస్ట్ చేస్తామన్నారు. గూాదీజ టన్నులు తమ హయంలో పూర్తి చేసి ఎన్నికలకు వెళ్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.

## అస్సాంలో లోహ కర్మాగార పేలుడు

- నలుగురు కార్మికులు మృతి
- ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్సీ సుమోటో..
- రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు

ఆదాబ్ సైబరాబాద్, న్యూఢిల్లీ : అస్సాంలోని కాచర్ జిల్లాలో లోహ శుద్ధి కర్మాగారంలో జరిగిన ఘోర పేలుడులో నలుగురు కార్మికులు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ) సుమోటోగా స్పందించింది. ఈ ఘటనకు సంబంధించిన మీడి యా కథనాలను పరిగణనలోకి తీసుకున్న కమిషన్, అస్సాం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాచర్ జిల్లా ఎస్పీకి నోటీసులు జారీ చేసింది.రెండు వారాల్లోగా ఘటనపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించిన ఎన్‌హెచ్‌ఆర్సీ, గాయపడిన కార్మికుల ఆరోగ్య పరిస్థితి, మృతుల కుటుంబాలకు అందించిన పరిహారం, బాధితులకు చెల్లించిన నష్టపరిహారం వివరాలను కూడా నివేదికలో పొందుపరచాలని సూచించింది.జూలై 26న వెలువడిన మీడియా కథనాల ప్రకారం, కర్మాగారంలో సంభవించిన పేలుడు అనంతరం కరిగిన లోహం కార్మికులపై పడటంతో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ కర్మాగారంలో గతంలో కూడా ఇలాంటి ప్రమాదాలు జరిగినట్లు బాధితుల కుటుంబ సభ్యులు, స్థానికులు ఆరోపించినట్లు నివేదికలు పేర్కొన్నాయి.మీడియా కథనాల్లో వెల్లడైన అంశాలు నిజమైతే, ఇది కార్మికుల మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన అత్యంత తీవ్రమైన ఘటనగా పరిగణించాల్సి ఉంటుందని ఎన్‌హెచ్‌ఆర్సీ పేర్కొంది.అలాగే జూలై 27న వెలువడిన మరో మీడియా నివేదిక ప్రకారం, పేలుడు సంభవించిన సమయంలో కర్మాగారంలో 100 మందికి పైగా కార్మికులు విధుల్లో ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రమాదానికి గల కారణాలు, భద్రతా ప్రమాణాల అమలు, కార్మికుల సంక్షేమ చర్యలపై కూడా సమగ్ర వివరాలను అందించాలని కమిషన్ రాష్ట్ర అధికారులను ఆదేశించింది.

### కాంగ్రెస్‌ను రాజకీయంగా ఇరుకున పెట్టాలని

## బీఆర్ఎస్ వ్యూహం



హైదరాబాద్ : తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్లపై పోరు సాగిస్తున్న బీఆర్ఎస్ ఎస్సీ సంగ్రామ సదస్సుకు సన్నాహాలు చేస్తోంది. రైతు, యువ సంగ్రామ సదస్సులు పూర్తైన నేపథ్యంలో చేవెళ్ల వేదికగా ఎస్సీలకు, నాడు హస్తం పార్టీ ఇచ్చిన హామీలను గుర్తు చేసేందుకు సిద్ధమైంది. బీఆర్ఎస్‌లోని ఎస్సీ నేతలతో త్వరలోనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశమై సదస్సు విషయంపై నిర్ణయం తీసుకోనున్నారు. డిక్లరేషన్లలో ఇచ్చిన హామీలపై : 2023 అసెంబ్లీ ఎన్ని కల సమయంలో కాంగ్రెస్ పార్టీ వివిధ వర్గాలకు ప్రకటించిన డిక్లరేషన్లనే బీఆర్?ఎస్? ఇప్పుడు రాజకీయ అస్త్రంగా మలుచుకుంటోం ది. ఎన్నికల ముందు రైతులు, యువత, మహిళలు, ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు తదితర వర్గాలకు ప్రత్యేక డిక్లరేషన్ల రూపంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీసే ందుకు ప్రధాన ప్రతిపక్షం కార్యాచరణను ముమ్మరం చేసింది. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటినా డిక్లరేషన్లలోని కీలక హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోంది.ప్రజలకు వివరించాలనే : కాంగ్రెస్ పార్టీ ఏ వేదికలపై ఆయా డిక్లరేషన్లను ప్రకటించిందో, అదే ప్రాంతాల్లో "సంగ్రామ సదస్సులు" నిర్వహించాలని గులాబీ అధినాయకత్వం నిర్ణయించింది. దీంతో కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా ఇరుకున పాటు ఆయా వర్గాల్లో మళ్లీ తమ పట్టు పెంచుకోవాలని బీఆర్ఎస్ వ్యూహాలు రచిస్తోంది.

## తెలంగాణలో పోలీస్ కొలువుల జాతర

### - 7,437 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ




హైదరాబాద్ :రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న లక్షలాది మంది నిరుద్యోగులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ఈ మేరకు పోలీస్‌శాఖలో సివిల్, ఏఆర్, స్పెషల్ పోలీసు, ఫైర్, జైళ్లశాఖలో పలు ఖాళీల భర్తీకి సంబంధించి 7,437 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. త్వరలో దరఖాస్తు తేదీలను ప్రకటిస్తామని పోలీసు నియామక మండలి తెలిపింది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని తెలిపింది. వివరాలకు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని నియామక మండలి తెలిపింది.

## సర్’ ప్రక్రియను వేగవంతం చేయాలి

- ‘సర్’ ప్రక్రియ దురుద్దేశంతో జరుగుతుంది.
- ఢిల్లీలో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం.



ఢిల్లీ, జులై 29 : ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియను కాంగ్రెస్ బీఎల్ఏలు వేగవంతం చేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేసేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ఎమ్మెల్సీ గ్రాడ్యుయేషన్ ఎలక్షన్‌పై జిల్లా ఇన్‌చార్జ్, జిల్లా పీసీసీలతో చర్చించి ముగ్గురు సభ్యులతో ప్యానల్ ఏర్పాటు చేసి నివేదిక అందించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలని సూచించారు. బీఎల్ఏలు బాగా పనిచేస్తున్నారని అభినందించారు. ఏఐసీసీ కార్యాలయంలో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.‘సర్’పై రివ్యూ చేశామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. 36 వేల మంది బీఎల్ఏ(లను నియమించినట్లు చెప్పారు. 50 నుంచి 60 శాతం ఈ ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో వందశాతం పూర్తవుతుందని వివరించారు. అర్హతగల ఓటర్ల ఓటు హక్కు కాపాడటం తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈసారి ‘సర్’ ప్రక్రియ దురుద్దేశంతో జరుగుతుందని చెప్పారు. ఓట్లను కాపాడే ఉద్దేశంతో ఈ సమావేశంలో చర్చించామని తెలిపారు. సంస్థాగత బలోపేతం, పార్టీ ప్రభుత్వ సమన్వయంపై మాట్లాడామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.కాగా, ఢిల్లీ ఇందిరా భవన్‌లో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఈరోజు (బుధవారం) జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ , మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , సీతక్క , సీడబ్ల్యూసీ సభ్యులు మంత్రి దామోదర్ రాజానర్సింహ, వంశీ చంద్ పాల్గొన్నారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. తెలంగాణలో ‘సర్’ ప్రక్రియ, పార్టీ – ప్రభుత్వం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రధానంగా చర్చించారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఏర్పాటు చేసిన కోఆర్డినేషన్ కమిటీ పనితీరు, ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ కార్యక్రమాల సమన్వయం, ప్రజలకు చేరువ చేసే కార్యాచరణపై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, సంస్థాగత బలోపేతం, రాజకీయ పరిస్థితులపై కూడా ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం.

## తూర్పు కనుమల్లో అరుదైన మొక్క ఆవిష్కరణ.



తిరుపతి జిల్లా:మన తూర్పు కనుమలు దట్టమైన అడవుల తోనే కాదు, ప్రపంచంలో ఎక్కడా లేని అరు దైన సహజ సంపదతో నిండి ఉన్నా యని మరోసారి నిరూపితమైంది. తిరుపతి జిల్లా పరిధిలోని తూర్పు కనుమలలో పరిశోధకులు సరికొత్త రకానికి చెందిన అరుదైన మొక్కను కనుగొన్నారు.ఈ కొత్త వృక్ష జాతికి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, అటవీ మరియు పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఒక ప్రత్యేకమైన పేరును ఖరారు చేశారు.యూఫోర్బి యేసీ కుటుంబానికి చెందిన ఈ కొత్త మొక్కకు "క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్") అని పేరు పెట్టారు. తిరుపతి జిల్లాలోని ప్రసిద్ధ ఉబ్బలమడుగు జలపాతానికి సమీపంలో ఉన్న కంబకం కొండల ప్రాంతంలో మాత్రమే ఈ మొక్క సహజంగా పెరుగుతోంది. అందుకే ఆ ప్రాంత పర్యావరణ ప్రాముఖ్యతను గుర్తించి, దానికి గుర్తుగా ‘ఉబ్బలమడుగెన్సిస్’ అనే పేరును ఖరారు చేశారు.ఈ మొక్క ఆకులు తాకగానే మంత్రముగ్ధులను చేసే అద్భుతమైన సుగంధ పరిమళాలను వెదజల్లుతాయి. దీని ప్రత్యేకతలు, సువాసన విశేషాలు పవన్ కళ్యాణ్‌ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సహజ వారసత్వ సంపదను, ప్రకృతిని కాపాడుకోవడంలో రాష్ట్ర కూటమి ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతకు అద్దం పడుతోంది.

### బంగాళాఖాతంలో మునిగిన వాళ్లే హైడ్రాను

## ముంచుతామంటారా



హైదరాబాద్, జులై 29: హైడ్రాపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. (బుధవారం) మీడియాతో మాట్లాడుతూ. బంగాళాఖాతంలో మునిగిపోయిన వాళ్లే హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తామంటే అర్థం లేదంటూ సెటైర్ విసిరారు. వర్షాకాలం వచ్చినా ఇప్పటికీ 30 శాతం లోటు వర్ష పాతం నమోదైందని తెలిపారు. 150 ఏళ్ల నుంచి చూడని ప్రకృతి వైపరీత్యం వచ్చిందన్నారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌లో కూడా తీవ్ర ఎల్‌నినో ప్రభావం ఉంటుందని చెప్పుకొచ్చారు. ప్రకృతి వైపరీత్యాన్ని గ్రామగ్రామాన ప్రజలకు తెలియజేస్తున్నామని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తున్నామన్నారు. రైతులు మెట్ట పంటలు వేస్తున్నారని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ వైపు ఎక్కువగా రైతులు మొగ్గుచూపుతున్నారని, ఇది మంచి శుభపరిణామమని అన్నారు. గాంధీ భవన్‌ను దేవాలయంగా భావించి నమ్మకంతో ప్రజలు సమస్యలు చెప్పుకోవడానికి వస్తున్నారన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపిస్తున్నామని తెలిపారు. ఏ పార్టీ నిర్వహించని ముఖాముఖిని కాంగ్రెస్ నిర్వహిస్తోందన్నారు. కలెక్టర్లతో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేస్తున్నామని చెప్పారు.

### ఆగస్టు 3లోగా 100 శాతం

## డిజిటలైజేషన్ పూర్తి చేయాలి




హైదరాబాద్, జులై 29: ఓటరు జాబితా సవరణ కేవలం తప్పులు లేని ఓటర్ల జాబితా కోసమేనని తెలంగాణ ఎన్నికల సంఘం సీఈవో సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో ఎస్ఐఆర్ (ూ×=) పురోగతిపై జిల్లా కలెక్టర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆగస్ట్ 3వ తేదీలోగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 76 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో 90 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందన్నారు. 8 నియోజకవర్గాల్లో 100 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేసినట్లు చెప్పారు.
జీహెచ్ఎంసీతోపాటు రంగారెడ్డి, మేడ్చల్ తదితర పట్టణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. డిజిటలైజేషన్‌లో నిర్లక్ష్యం వహిస్తే బీఎల్ఓలు, సూపర్‌వైజర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒకే కుటుంబ సభ్యుల ఓట్లన్నీ.. ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల సమావేశాలను వీడియో తీయాలని జిల్లా కలెక్టర్లను సీఈఓ ఆదేశించారు. వీఐపీ, వీవీఐపీ ఓటర్ల మ్యాపింగ్ చేపట్టాలని వారికి సీఈవో సుదర్శన్ రెడ్డి సూచించారు. ఎస్ఐఆర్‌కు సంక్షేమ పథకాలతో ఎలాంటి సంబంధం లేదని ఆయన పునరుద్ఘాటించారు.


# తహసీల్దార్ ఆదేశాలు బేఖాతరు చేశారా..!

- నిర్మాణ అనుమతులు ఇవ్వదని గత ఎంఆర్ఓ ఆర్డర్
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నా ప్రస్తుత రెవిన్యూ అధికారులు
- ప్రభుత్వ భూముల్లో వందలాది భవనాలకు అనుమతులపై ప్రశ్నలు



**ఆదాబ్ సైబరాబాద్, కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం గ్రామంలోని సర్వే నంబర్లు 329/1 నుంచి 329/10 అనగా రవి నారాయణరెడ్డి కాలనీ, మహాదేవపురం, దేవేందర్ నగర్ అలాగే చుట్టుప్రక్కన వరకు ఉన్న భూములను ప్రభుత్వ భూములుగా పరిగణిస్తూ, వాటికి ఎలాంటి భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయవద్దని అప్పటి కుత్బు ల్లాపూర్ తహసీల్దార్ 2024 సెప్టెంబర్ 13న జీహెచ్ఎంసీ గాజుల రామారం సర్కిల్-26 టౌన్ ప్లానింగ్ అధికారులకు లిఖిత పూర్వకంగా ఆదేశాలు జారీ చేశారు.

తహసీల్దార్ లేఖలో, సర్వే నంబర్ 329 మొత్తం 255 ఎకరాలు 28 గుంటలు "గైరాన్ సర్కార్" (ప్రభుత్వ భూమి)గా రెవెన్యూ రికార్డుల్లో నమోదైందని, అలాగే సర్వే నంబర్లు 329/1 నుంచి 329/10 వరకు ఉన్న భూములు స్టాంపులు అలాగే రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22-ఏ కింద నోటిపై చేయబడ్డాయని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఈ భూములకు సంబంధించిన వివాదం హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున ఎలాంటి భవన అనుమతులు ఇవ్వరాదని సూచించారు. అయితే స్థానికుల ఆరోపణల ప్రకారం, ఈ స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, సంబంధిత సర్వే నంబర్ల పరిధిలో వందలాది భవనాలు నిర్మాణం చేపట్టినట్లు చెబుతున్నారు. ఈ అంశంపై రెవెన్యూ, మున్సిపల్ శాఖల మధ్య సమన్వయం లోపించిందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తహసీల్దార్ అధికారిక లేఖ వెలుగులోకి రావడంతో, ఈ సర్వే నంబర్లలో గతంలో జారీ చేసిన భవన అనుమతులు, ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణాలు, సంబంధిత అధికారుల బాధ్యతపై సమగ్ర విచారణ జరపాలని స్థానికులు, ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు అధికారికంగా స్పందించాల్సి ఉంది.



GOVERNMENT OF TELANGANA
REVENUE DEPARTMENT

From
Sri Abdul Rahman Khan,
Tahsildar,
Quthbullapur Mandal.

To
The Deputy Commissioner,
Gajularamaram Circle- 26,
GHMC, Hyderabad.

Lr.No.B/1415/2024. Dated: 13 .09.2024.

Sir,

Sub:Gajularamaram Circle26 -Town Planning Section -Request to give Clrification in respect of Sy No.329/1 to 329/10 of Gajularamaram village. Quthbullapur Mandal, Medchal Malkajgiri District Whether to issue building permissions or not- Reply-Reg

Ref: 1.Lr No. 308/TPS/C26/KPZ/GHMC/2024 dt 30.08.2024 of DC, C-26, GHMC.

***

Kind attention is invited to the subject and reference cited, wherein the Deputy Commissioner, Circle -26, GHMC has sought clarification on the whether to accord permissions in Sy.No 329/1 to 329/10.

In this regard, it is informed that as per Nakal Sethwar of Gajularamaram Village available, the Sy No.329 total admeasuring Ac.255.28 gts is recorded as "Gairan Sarkar"( Government land) and also the said Sy No.329/1 to 329/10 of Gajularamaram village have been notified under section 22-A of Stamps and Registration Act.

It is also informed that the land in Sy No.329/1 to 329/10 of Gajularamaram village is being treated as Government Land and continue to remain in the possession and also a case is pending in the Hon'ble High Court vide WP No.28332/16.

In view of the above, it is requested not ~~give~~ to accord any building permissions in respect of Sy No.329/1 to 329/10 of Gajularamaram village. Quthbullapur Mandal, Medchal Malkajgiri District,.

Office of the Deputy Commissioner, INWARD, Date: 26/9/24, Gajularamaram Circle-26, GHMC

Yours faithfully

Tahsildar,
Quthbullapur Mandal

# గురుబ్రహ్మా గురువిష్ణు గురుదేవో మహేశ్వర గురు సాక్షాత్ పరబ్రహ్మా తస్మై శ్రీ గురువే నమః




**- గురు పూర్ణిమ సందర్భంగా న్యూ పవర్ కుంగ్ అకాడమీ ఆధ్వర్యంలో గురువులకు సన్మానం**

**ఆదాబ్ సైబరాబాద్, షాద్ నగర్ :** షాద్ నగర్ పట్టణంలోని సత్యనారాయణ స్వామి దేవాలయం వద్ద న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ కోచ్ అహ్మద్ ఖాన్ తన గురువుగారైన బాలరాజ్ మాస్టర్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు తమ కోచ్ అహ్మద్ మాస్టర్, బాలరాజ్ మాస్టర్ ను ఘనంగా సన్మానించి వారి యొక్క గురుభక్తిని చాటుకున్నారు. గురువు ఎల్లప్పుడూ తన శిష్యులను ఉన్నత స్థాయిలో ఉండాలని ఆకాంక్షించే వ్యక్తి గురువుగారని వారి యొక్క ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కదులుతున్న రైలులో ముగ్గురు మిస్సింగ్

**- బాలికలను గుర్తించిన మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు**
**- కుటుంబాలకు సురక్షితంగా అప్పగింత**



**ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ :** మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు, రైల్వే పోలీసుల సహకారం మరియు సాంకేతిక నిఘా (టెక్నికల్ సర్వైలెన్స్) సహాయంతో కదులుతున్న రైలులో ప్రయాణిస్తున్న ముగ్గురు అదృశ్యమైన మైనర్ బాలికలను మధ్యప్రదేశ్‌లో గుర్తించి సురక్షితంగా రక్షించి, వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసుల వివరాల ప్రకారం, ముగ్గురు బాలికలు జూలై 24న తల్లిదండ్రులు చిన్నచిన్న విషయాలపై తరచూ మందలించడంతో మనస్తాపానికి గురై ఇళ్ల నుంచి వెళ్లిపోయారు. మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో కాటేదాన్ నుంచి ఆటోలో బుద్వేల్ రైల్వే స్టేషన్‌కు చేరుకుని, అక్కడి నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లి ఢిల్లీకి వెళ్తున్న దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైలును ఎక్కారు. జూలై 25 ఉదయం సుమారు 11 గంటలకు బాలికల్లో ఒకరి తల్లి మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసును అత్యంత ప్రాధాన్యతగా తీసుకున్న పోలీసులు, రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ పర్యవేక్షణలో ప్రత్యేక గాలింపు చర్యలు ప్రారంభించారు.

బాలికలను గుర్తించేందుకు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. రైల్వే పోలీసులతో సమన్వయం చేసుకుని పలు ప్రాంతాల సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి వారి ప్రయాణ మార్గాన్ని గుర్తించారు. విచారణలో బాలికల్లో ఒకరు రహస్యంగా మొబైల్ ఫోన్ తీసుకెళ్లి, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను ఉపయోగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆ ఖాతాకు అనుసంధానమైన మొబైల్ నంబర్‌ను సాంకేతికంగా విశ్లేషించి వారి ప్రస్తుత స్థానాన్ని గుర్తించారు. సాంకేతిక ఆధారాల ద్వారా బాలికలు దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నట్లు నిర్ధారించిన పోలీసులు, వారు ప్రయాణిస్తున్న కోచ్, సీటు వివరాలను కూడా గుర్తించారు. ఈ సమాచారాన్ని రైల్వే పోలీసులకు అందించడంతో, మధ్యప్రదేశ్‌లోని బీనా రైల్వే స్టేషన్ వద్ద రైలును అడ్డుకుని ముగ్గురు బాలికలను సురక్షితంగా రక్షించారు. అనంతరం వారిని హైదరాబాద్‌కు తీసుకొచ్చి, అవసరమైన చట్టపరమైన ప్రక్రియలు, కౌన్సెలింగ్ పూర్తి చేసిన అనంతరం వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసులు తల్లిదండ్రులకు కీలక సూచనలు చేశారు. పిల్లలతో ఎప్పటికప్పుడు స్నేహపూర్వకంగా మాట్లాడాలని, వారి భావోద్వేగాలను అర్థం చేసుకుని ఓర్పుతో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అలాగే పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలపై తగిన పర్యవేక్షణ ఉంచడంతో పాటు, మానసిక ఒత్తిడి లేదా ఇబ్బందులు ఎదురైనప్పుడు కుటుంబ సభ్యులు లేదా నమ్మకమైన పెద్దల సహాయం కోరేలా వారిని ప్రోత్సహించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# కుషాయిగూడ బస్ స్టాప్ ట్రాఫిక్ సమస్యకు పరిష్కార చర్యలు



**ఆదాబ్ సైబరాబాద్, కుషాయిగూడ :** కుషాయిగూడ బస్ స్టాప్ వద్ద నెలకొన్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు. కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తికి స్పందించిన కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ పోతుల వీరేంద్ర సాగర్ బస్ స్టాప్‌ను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ట్రాఫిక్ సీఐ మల్లేష్, కుషాయిగూడ బస్ డిపో మేనేజర్ వేణుగోపాల్‌తో కలిసి ట్రాఫిక్ రద్దీకి గల కారణాలను పరిశీలించారు. రహదారిపై పూల దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని గుర్తించారు. దీంతో పూల వ్యాపారులు మార్కెట్ గోడకు ఆనుకుని దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారం కొనసాగించాలని అధికారులు సూచించారు. ఈ నిర్ణయానికి పూల వ్యాపారులు అంగీకరిస్తూ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తగ్గి బస్సులు, ఇతర వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు ఈ చర్యలు ఉపయోగపడతాయని కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పనగట్ల చక్రపాణి గౌడ్, కొడకండ్ల యాదయ్య, పండాల గణేష్ గౌడ్, వాసుదేవ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# జన్మభూమి కాలనీలో నీటి సమస్యకు పరిష్కారం..

**- అధికారులతో కలిసి పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు జిల్లా గణేష్**




**ఆదాబ్ సైబరాబాద్, ఆల్విన్ కాలనీ :** శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ ఉమ్మడి 124వ డివిజన్ పరిధిలోని జన్మభూమి కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను కాంగ్రెస్ నాయకులు, వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి పరిశీలించారు. కాలనీలో గత వారం రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నా మని స్థానిక మహిళలు, కాలనీ వాసులు పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను గుర్తించిన ఎమ్మెల్యే గాంధీ ఆదేశాల మేరకు వాటర్ వర్క్స్ మేనేజర్ అనిల్, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్‌తో కలిసి కాంగ్రెస్ నాయకులు జిల్లా గణేష్ క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ, వారం రోజులుగా నీటి సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, నీటి కోసం గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తుండటంతో ఉపాధికి వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. లైన్‌మన్ కరుణాకర్ సరైన సమాధానం ఇవ్వడం లేదని కూడా ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన జిల్లా గణేష్, అధికారులను వెంటనే నీటి సరఫరా పునరుద్ధరించాలని ఆదేశించారు. ఆయన సమక్షంలోనే కాలనీకి నీటిని విడుదల చేయించారు. ఇకపై కాలనీకి కేటాయించిన సమయానికి తప్పనిసరిగా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు.

కాలనీలోని ఎక్కువ మంది రోజువారీ కూలీలు కావడంతో, నీటి కోసం వేచి ఉండాల్సి రావడం వల్ల ఉపాధిని కోల్పోతున్నారని జిల్లా గణేష్ అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువ నాయకులు రెహమాన్, నాగరాజు, సుంకన్న, ఇతర నాయకులు, మహిళలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# విద్యార్థులే పర్యావరణ పరిరక్షణకు రాయబారులు కావాలి: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి




**ఆదాబ్ సైబరాబాద్, సికింద్రాబాద్ :** సెయింట్ మేరీస్ హై స్కూల్‌లో నిర్వహించిన ఎన్విరాన్మెంట్ డే--2026 వేడుకల్లో మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించిన ఎమ్మెల్యే అనంతరం మొక్కలకు నీరు పోసి పర్యావరణ పరిరక్షణపై సందేశమిచ్చారు. తాను చదివిన పాఠశాలలోనే ముఖ్య అతిథిగా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులే నిజమైన రాయబారులుగా మారాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆసక్తిగా వీక్షించి అభినందించారు. కార్యక్రమంలో రెవరెండ్ ఫాదర్ ఇన్నయ్య, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, లియోనార్డ్ మీఘర్, అరుణ్ రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంఘా గిరి ప్రదక్షిణ గురు పౌర్ణిమ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామివారి గిరి ప్రదక్షిణ మహోత్సవం ఘన విజయం

**- గిరి ప్రదీక్షణలో పాల్గొన్న కీసర సిఐ అర్కపల్లి ఆంజనేయులు**



**ఆదాబ్ సైబరాబాద్, కీసర :** గురు పౌర్ణిమ అనే మహోన్నత పర్వదినాన్ని పురస్కరించుకొని, ఈ రోజు ఉదయం హేమాద్రి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించిన శ్రీ వెంకటేశ్వర స్వామివారి గిరి ప్రదక్షిణ మహోత్సవం భక్తుల అపూర్వ స్పందన మధ్య అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో విజయవంతంగా జరిగింది. బుధవారం ఉదయం జరిగిన ఈ పవిత్ర గిరి ప్రదక్షిణలో వందలాది మంది భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పాల్గొని, "గోవింద... గోవింద..." నామస్మరణల మధ్య గిరి ప్రదక్షిణ పూర్తి చేసి, హేమాద్రి శ్రీ వెంకటేశ్వర స్వామివారి దివ్య దర్శనం చేసుకొని ఆశీర్వాదాలను పొందారు. ఈ మహోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసి భక్తులతో కలిసి గిరి ప్రదక్షిణలో పాల్గొన్న సి.ఐ. అర్కపల్లి అంజనేయులు. హేమాద్రి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు.

అదేవిధంగా, ఈ మహోత్సవాన్ని విజయవంతం చేసిన ప్రతి భక్తునికి, స్వచ్ఛంద సేవకులకు, పోలీసు శాఖ అధికారులకు, మీడియా ప్రతినిధులకు, దాతలకు, గ్రామ పెద్దలకు మరియు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ దేవస్థానం ట్రస్ట్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తోంది. హేమాద్రి శ్రీ వెంకటేశ్వర స్వామివారి అనంత కృపాకటాక్షాలు భక్తులందరిపై నిత్యం ప్రసరించాలని కోరుకుంటూ, భవిష్యత్తులో దేవస్థానంలో నిర్వహించబడే అన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఇదే విధమైన ఆదరణ, సహకారం అందించాలని హృదయపూర్వకంగా విజ్ఞప్తి చేస్తున్నామని హేమాద్రి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ శ్రీ కందాడి హనుమంత్ రెడ్డి తెలిపారు.

# గురు పౌర్ణమి వేళ యోగ గురువులకు ఘన సన్మానం



**- యోగతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమే సదానంద్ రెడ్డి**

**ఆదాబ్ సైబరాబాద్, వికారాబాద్:** గురు పౌర్ణమి సందర్భంగా యోగ సేవలను సమాజానికి అందిస్తున్న యోగ గురువులను ఘనంగా సత్కరి ంచారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ వికారాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు సదానంద్ రెడ్డి యోగ గురువులు అనంతయ్య, నారాయణ రాథోడ్, భీమ్లా నాయక్, వీరేశం లను శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా సదానంద్ రెడ్డి మాట్లాడుతూ, గురు పౌర్ణమి రోజున యోగ గురువులను సత్కరించడం ఎంతో ఆనందంగా, గర్వకారణంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో యోగను అలవాటు చేసుకోవాలని సూచించారు. యోగ సాధన వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు రోగనిరోధక శక్తి పెరిగి అనారోగ్య సమస్యలు దూరమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లేషం, మోహన్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సీఐ వీరబాబును మర్యాదపూర్వకంగా కలిసిన ఉప సర్పంచ్ అప్పల సిద్ధయ్య




**ఆదాబ్ సైబరాబాద్ షాద్ నగర్, జూలై 29 (న్యూస్):** నందిగామ పోలీస్ స్టేషన్‌లో ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) వీరబాబును నర్సప్పగూడ గ్రామ ఉప సర్పంచ్ అప్పల సిద్ధయ్య బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సీఐ వీరబాబుకు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం ఉప సర్పంచ్ మాట్లాడుతూ..నందిగామ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మరింత మెరుగైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పోలీసులు సేవలందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కట్న శేఖర్, కురుమ సంఘం అధ్యక్షుడు కట్న శ్రీనివాస్, బీరప్ప, శేఖర్, కృష్ణ, మహేందర్, యాదగిరి భూపాల్ శేఖర్ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు మరియు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

TGTEL/26/A4985
ఆదాబ్ సైబరాబాద్
ADAAB CYBERABAD
గురువారం, జూలై 30, 2026


## శంకర్‌పల్లి మండలంలో ఎస్ఐఆర్--2026పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయ సమావేశం



ఆదాబ్ సైబరాబాద్, శంకర్ పల్లి :- రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలో ఎస్ఐఆర్--2026 కార్యక్రమం అమలుపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్--2026 పనుల పురోగతిని అధికారులు సమీక్షించారు. సమావేశంలో నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్లు, మరణిం చిన ఓటర్లు, డూప్లికేట్ నమోదులు, మ్యాపింగ్ కాని ఓటర్లు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు తదితర వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేసి పరిశీలించాలని కోరారు.అలాగే సంబంధిత బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు),బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు) సమ న్వయం చేసుకుని అర్హులైన ప్రతి ఓటరును నిర్దేశిత గడువులోగా 100 శాతం మ్యాపింగ్ పూర్తి చేయడానికి సహకరించాలని అధికారులు సూచించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, ఖచ్చితంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల సహకారం అవసరమని ఈ సందర్భంగా తెలిపారు.

## రాంపల్లి మహంకాళి ఆలయానికి రూ.2 లక్షల విరాళం అందించిన

**– కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు కౌకుంట్ల జీవన్ రెడ్డి,**



ఆదాబ్ సైబరాబాద్ , నాగారం డివిజన్ : కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు కౌకుంట్ల జీవన్ రెడ్డి రాంపల్లి గ్రామంలోని శ్రీ మహంకాళి అమ్మవారి దేవాలయ అభివృద్ధి పనులతో పాటు త్వరలో నిర్వహించనున్న బోనాల మహోత్సవాల ఏర్పాట్ల కోసం రూ.2 లక్షల విరాళాన్ని అందజేశారు. ఆలయానికి ఆయన అందించిన విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులు స్వీకరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ, అమ్మవారి సేవలో భాగస్వామ్యం కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఆలయ అభివృద్ధితో పాటు బోనాల మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు తన వంతు సహకారం అందించినట్లు పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు జీవన్ రెడ్డి సేవా భావాన్ని అభినందిస్తూ, శ్రీ మహంకాళి అమ్మవారి ఆశీస్సులు వారి కుటుంబ సభ్యులపై ఎల్లప్పుడూ ఉండాలని

## అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్




**– చైన్ స్నాచింగ్ నేరస్తులను అరెస్టు చేసిన పోలీసులు.**
**– ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి. బంగారం, బైకు, మొబైల్స్, రెండు కత్తులు స్వాదినం.**
**– మీడియా సమావేశంలో పాల్గొన్న డిసిపి శిరీష,ఏసీపీ లక్ష్మీనారాయణ.**

ఆదాబ్ సైబరాబాద్ షాద్ నగర్ 29:రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ డీసీపీ కార్యాలయంలో పోలీసులు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశం లో పాల్గొన్న ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషి,కేసు వివరాలు వెల్లడించారు.సీపీ తెలిపిన వివరాల ప్రకారం..... రంగారెడ్డి జిల్లా కేశంపేట మండల సంతాపూర్ పరిధిలో, కడ్తల్ వద్ద రెండు చోట్ల ఈ నెల 24 వ తేదీ నాడు ఇద్దరు మహిళల మేడలో నుండి బంగారు చైన్లు లాక్కెళ్లినట్లు పిర్యాదులు రాగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారని, సాంకేతిక పరిజ్ఞానం తో కేసును దర్యాప్తు చేసి దుండగులను ఈ రోజు కేశంపేట వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఇద్దరు నిందితులు రాజస్థాన్ నుండి షాద్ నగర్ పరిధిలో వరి కోతల సమయం లో వరి కోత మిషన్ పని మీద తరచూ ఇక్కడకి వస్తారని, వెళ్లే ముందు ఇక్కడ దొంగతనాలు చేసి వెళ్ళిపోతారని తెలిపారు. నిందితులు వాడిన బైక్ మహబూబ్ నగర్ వద్ద దొంగించారని, మొబైల్ ఫోన్లు రైలు లో దొంగిలించారని తెలిపారు. ఇద్దరినీ అరెస్ట్ చేయగా మరొకరు పరారిలో ఉన్నట్లు తెలిపారు. నిందితుల నుండి 8 తులాల బంగారం, ఒక బైకు ఐదు మొబైల్ ఫోన్లు, రెండు కత్తులు సీజ్ చేసి రిమాండ్ కు తరలించారు. నేరాల అదుపు కు ప్రజల సహకారం పోలీసులకు కావా లన్నారు.ఈ మీడియా సమావేశంలో డిసిపి శిరీష, ఏసిపి లక్ష్మీనారాయణ, సిఐలు శ్రీనివాస్, నరహరి, ఎస్సై తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## పంచాయతీ రాజ్ సీతక్క ఆదేశాలు, డీసీసీ అధ్యక్షులు పైడాకుల అశోక్ అన్న చూసినల మేరకు



**– భారీ వర్షాలు ఉన్నాయి కాబట్టి ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలి**
**– సీతక్క యువసేన జిల్లా అధ్యక్షులు చెర్ప రవీందర్ విజ్ఞప్తి**

ఆదాబ్ సైబరాబాద్,ములుగు జిల్లా ప్రతినిధి: వాతావరణ శాఖ విడుదల చేసిన తాజా సమాచారం ప్రకారం ములుగు జిల్లాలో రాబోయే మూడు రోజులపాటు భారీ వర్షాలు నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశముంది కాబట్టి ఈ నేపథ్యంలో ములుగు జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నాం అని సీతక్క యువసేన జిల్లా అధ్యక్షులు చెర్ప రవీందర్ అన్నారు ఈరోజు మేడారంలో ప్రెస్ నోట్ విడుదల చేస్తూ వాగులు, వంకలు, చెరువులు, లోతట్టు ప్రాంతాలు మరియు వరద ప్రవాహాలు ఉన్న ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలి అవసరం లేని ప్రయాణాలను వాయిదా వేసుకోవడం మంచిది వర్షాలు పడే సమయంలో చెట్లవద్ద మరియు స్థంబాల వద్ద నిలబడవద్దు ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంటుంది కావున జాగ్రత్తగా ఉండండి రైతులు తమ పంటలు, వ్యవసాయ పరికరాలు, రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలి తల్లితండ్రులు చిన్నారులను నేటి ప్రవాహాల దగ్గరకు వెళ్లకుండా జాగ్రత్త పడాలి అధికారులు జారీ చేసే సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలి అని అన్నారు

## సింగరేణి అనుబంధ సంస్థ ఏపీహెచ్ఎంఈఎల్‌లో 300 కిలోవాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ ప్రారంభం

**– వర్చువల్‌గా ప్రారంభించిన సింగరేణి సీఎండీ బుద్ధప్రకాశ్ జ్యోతి**
**– సీసీ, ఆర్‌సీసీ అంతర్గత రహదారుల ప్రారంభం ఏటా 24 లక్షల విద్యుత్ ఖర్చు ఆదా**
**– 50 ఏళ్ల చరిత్రలో అత్యధికంగా 23.33 కోట్ల నికర లాభం సాధించిన**
**– ఏపీహెచ్ఎంఈఎల్‌కు సీఎండీ అభినందనలు**








ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ : సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ అనుబంధ సంస్థ ఆంధ్రప్రదేశ్ హెవీ మెషినరీ అండ్ ఇంజినీరింగ్ లిమిటెడ్ స్వర్ణోత్సవాల సందర్భంగా విజయవాడలో ఏర్పాటు చేసిన 300 కిలోవాట్ల సౌర విద్యుత్ ప్లాంట్‌ను సింగరేణి సీఎండీ డా. బుద్ధప్రకాశ్ జ్యోతి, ఐఏఎస్ బుధవారం సింగరేణి భవన్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. అలాగే సంస్థలో నూతనంగా నిర్మించిన సీసీ, ఆర్‌సీసీ అంతర్గత రహదారులను కూడా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క మార్గదర్శకత్వంలో సింగరేణి సంస్థతో పాటు ఏపీహెచ్ఎంఈఎల్‌ను మరింత బలోపేతం చేసి, వ్యాపార విస్తరణ దిశగా ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు.
ఏపీహెచ్ఎంఈఎల్ ఉద్యోగులను అభినందించిన సీఎండీ, సంస్థ తన 50 ఏళ్ల చరిత్రలోనే అత్యధికంగా ?63.13 కోట్ల టర్నోవర్ సాధించడంతో పాటు రికార్డు స్థాయిలో ?23.33 కోట్ల నికర లాభం నమోదు చేయడం విశేషమని కొనియాడారు. గత ఏడాది ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సంస్థను సందర్శించిన సందర్భంగా ఇచ్చిన సూచనలు, ప్రోత్సాహం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. ఆయన హామీ మేరకు సంస్థలో మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా సీసీ, ఆర్‌సీసీ రహదారుల నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు వెల్లడించారు.1976 సెప్టెంబర్ 1న స్థాపించబడిన ఏపీహెచ్ఎంఈఎల్ ప్రస్తుతం స్వర్ణోత్సవ సంవత్సరంలోకి అడుగుపెట్టిందని గుర్తుచేసిన సీఎండీ, ప్రస్తుతం తయారు చేస్తున్న యంత్రాలు, పరికరాలు, విడిభాగాలకు పరిమితం కాకుండా వివిధ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కొత్త వ్యాపార అవకాశాలను అన్వేషించాలని యాజమాన్యానికి సూచించారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని మరింత పారిశ్రామిక అభివృద్ధి సాధించేందుకు సింగరేణి నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఏటా 24 లక్షల విద్యుత్ ఖర్చు ఆదా
ప్రస్తుతం ఏపీహెచ్ఎంఈఎల్ తయారీ యూనిట్, ఉద్యోగుల కాలనీ కలిపి సంవత్సరానికి సుమారు ?60 లక్షలు విద్యుత్ బిల్లులపై ఖర్చు చేస్తోంది. ?1.24 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 300 కిలోవాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ ద్వారా ఏటా సుమారు ?24 లక్షల విద్యుత్ వ్యయం ఆదా కానుంది. ఈ పెట్టుబడి ఐదేళ్లలో తిరిగి రానుండటంతో పాటు పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహిస్తూ పర్యావరణ పరిరక్షణకు దోహదం చేయనుంది.ఏపీహెచ్ఎంఈఎల్ చైర్మన్ ఎన్.వి.కె. శ్రీనివాస్ మాట్లాడుతూ, సంస్థ భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. సింగరేణి, కోల్ ఇండియా లిమిటెడ్, ఎన్ఎండీసీ నుంచి వచ్చిన ఆర్డర్లను నిర్ణీత గడువులో విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రు, ఎం. తిరుమలరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్) బి. వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్ అండ్ మార్కెటింగ్) టి. శ్రీనివాస్, ఏపీహెచ్ఎంఈఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. ఎర్రన్న, సంస్థ ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్, ములుగు జిల్లా

**– తాడ్వాయి మండలం మేడారం జంపన్న వాగు ప్రాంతంలో ప్రత్యేక పరిశీలన దృష్టి**
**– భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు హెచ్చరిక ములుగు సబ్ డివిజన్ పరిధిలో గత కొన్ని రోజులుగా**
**– కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నాము.**




ఆదాబ్ సైబరాబాద్,ములుగు జిల్లా ప్రతినిధి:ములుగు జిల్లా భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు, చెరువులు మరియు లోతట్టు ప్రాంతాలు ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్నందున, అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లకుండా ఉండాలి. ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు, కాలువలు లేదా రహదారులపై నీరు ప్రవహిస్తున్న ప్రాంతాలను ఎట్టి పరిస్థితుల్లోనూ దాటేందుకు ప్రయత్నించరాదు.తల్లిదండ్రులు తమ పిల్లలను వరద నీటి ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రైతులు, పశువుల కాపరులు వర్షం మరియు పిడుగులు పడుతున్న సమయంలో చెట్ల కింద నిలబడకుండా సురక్షిత ప్రదేశాల్లో ఆశ్రయం పొందాలి.వాహనదారులు భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో, ముఖ్యంగా రాత్రి వేళల్లో, అత్యంత అప్రమత్తంగా ప్రయాణించాలి. రహదారుల పరిస్థితిని తెలుసుకున్న తర్వాత మాత్రమే ప్రయాణాలు చేపట్టాలి. ఎక్కడైనా రహదారులు దెబ్బతినడం, చెట్లు కూలిపోవడం, వరద నీరు చేరడం లేదా రహదారులపై నీరు ప్రవహించడం వంటి పరిస్థితులు ఎదురైతే, అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ వారికి పూర్తి సహకారం అందించాలి.ములుగు జిల్లా పోలీసు సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండి, లోతట్టు ప్రాంతాలు, వాగులు, ప్రధాన రహదారులు మరియు వరద ప్రభావిత ప్రాంతాల్లో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ప్రజలందరూ పోలీసు శాఖ మరియు ఇతర ప్రభుత్వ శాఖలు జారీ చేసే సూచనలు, హెచ్చరికలను పాటిస్తూ తమ భద్రతతో పాటు ఇతరుల భద్రతకు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాము.ఎన్. రవీందర్‌సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ ములుగు

## భారత్ టాక్సీకి దేశవ్యాప్తంగా స్పందన

**– 7.97 లక్షల మంది డ్రైవర్ల నమోదు**




ఆదాబ్ సైబరాబాద్, న్యూఢిల్లీ: సహకార్ టాక్సీ కోఆపరేటివ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సహకార రంగం నిర్వహిస్తున్న డిజిటల్ మొబిలిటీ వేదిక 'భారత్ టాక్సీ' దేశవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తోంది. ఇప్పటికే ఢిల్లీ-ఎన్‌సీఆర్, గుజరాత్, మహారాష్ట్ర రాష్ట్రాల్లోని పలు నగరాల్లో ఈ సేవలు అధికారికంగా ప్రారంభమయ్యాయి.2026 జూలై 19 నాటికి దేశవ్యాప్తంగా 7.97 లక్షల మంది డ్రైవర్-భాగస్వాములు (సారథులు) భారత్ టాక్సీలో నమోదు చేసుకున్నారు. వీరిలో ఢిల్లీ-ఎన్‌సీఆర్ నుంచి 2.55 లక్షలు, గుజరాత్ నుంచి 1.01 లక్షలు, మహారాష్ట్ర నుంచి 71,095 మంది సారథులు ఉన్నారు.భారత్ టాక్సీ సేవలను ఇతర రాష్ట్రాలు, నగరాలకు విస్తరించేందుకు అవసరమైన ఆమోదాలు, కార్యాచరణ సంసిద్ధత, డ్రైవర్ల లభ్యత, చట్టపరమైన నిబంధనల అమలు, రాష్ట్ర ప్రభుత్వాలు, సహకార సంస్థలు, ఇతర భాగస్వాములతో సమన్వయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని దశలవారీగా విస్తరణ చేపట్టనున్నారు.ఈ వేదిక 'సున్నా కమీషన్' విధానంలో పనిచేయడం ప్రత్యేకత. ప్రయాణికులు యాప్ ద్వారా బుక్ చేసిన రైడ్లకు డ్రైవర్లు సంపాదించే ఛార్జీల్లో నుంచి ఎలాంటి కమీషన్ కోత ఉండదు. అయితే యాప్ నిర్వహణ, సాంకేతిక సేవలు, విస్తరణ ఖర్చుల కోసం డ్రైవర్ల నుంచి నామమాత్రపు రైడ్ సబ్‌స్క్రిప్షన్ లేదా ప్లాట్‌ఫారమ్ వినియోగ రుసుము మాత్రమే వసూలు చేస్తారు. దీంతో డ్రైవర్ల ఆదాయంపై ప్రతికూల ప్రభావం ఉండదని సంస్థ తెలిపింది.భారత్ టాక్సీ కో-ఆపరేటివ్ లిమిటెడ్‌లో సభ్యులుగా చేరిన సారథులు బహుళ-రాష్ట్ర సహకార సంఘాల చట్టం-2002 ప్రకారం సహకార సంఘ సభ్యులకు లభించే అన్ని ప్రయోజనాలకు అర్హులు అవుతారు.సభ్యుల సంక్షేమం కోసం రాయితీ ప్రీమియంతో ఆరోగ్య బీమా, వ్యక్తిగత ప్రమాద బీమా, ఎస్‌బీఐ ముద్రా రుణాలు, బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల ద్వా రా వాహన రుణ సౌకర్యాలు కల్పించడంతో పాటు డిజిటల్ యాప్ వినియోగం, వినియోగదారుల సేవలు, రహదారి భద్రత, ప్రయాణికుల భద్రత వంటి అంశాలపై నిరంతరం శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది.

## దేశంలో నక్సలిజం పూర్తిగా అదుపులోకి..!

**– ప్రభావిత జిల్లాల సంఖ్య సున్నా**
**– కేంద్ర హోం మంత్రిత్వ శాఖ**



ఆదాబ్ సైబరాబాద్, న్యూఢిల్లీ : దేశంలో దాదాపు ఆరు దశాబ్దాలుగా కొనసాగిన వామపక్ష తీవ్రవాదం (నక్సలిజం)ను సమర్థవంతంగా ఎదుర్కొని పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చినట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 2015లో అమలు చేసిన "వామపక్ష తీవ్రవాదాన్ని ఎదుర్కొనే జాతీయ విధానం -- కార్యాచరణ ప్రణాళిక" విజయవంతంగా అమలవడంతో ప్రస్తుతం దేశంలో వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాలు ఒక్కటీ లేవని తెలిపింది.హోం మంత్రిత్వ శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం, 2018లో నక్సల్ ప్రభావిత జిల్లాలు 126 ఉండగా, 2021లో 70, 2024లో 38, 2025 డిసెంబరులో 8కు తగ్గాయి. చివరకు 2026 మార్చి--ఏప్రిల్ నాటికి ఈ సంఖ్య సున్నాకు చేరింది. అయితే గతంలో ప్రభావితమైన 37 జిల్లాలను "లెగసీ అండ్ థ్రస్ట్" జిల్లాలుగా గుర్తించి అక్కడ భద్రత, అభివృద్ధి చర్యలు కొనసాగిస్తున్నారు. అదనంగా ఒక జిల్లాను "డిస్ట్రిక్ట్ ఆఫ్ కన్సర్న్"గా గుర్తించి ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు.కేంద్ర ప్రభుత్వం భద్రతా చర్యలతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపింది. 2014-15 నుంచి భద్రతా సంబంధిత వ్యయం పథకం కింద వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాలకు 3,805.04 కోట్లు విడుదల చేసింది. అలాగే ప్రత్యేక మౌలిక సదుపాయాల పథకం ద్వారా 1,761 కోట్ల పనులకు ఆమోదం ఇవ్వగా, దేశవ్యాప్తంగా 663 పటిష్ట పోలీస్ స్టేషన్లు నిర్మించబడ్డాయి. కేంద్ర సంస్థలకు సహాయం కోసం మరో ?1,303.68 కోట్లు కేటాయించారు.లొంగిపోయిన నక్సల్స్ పునరావాసానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. ఉన్నత స్థాయి కార్యకర్తలకు ?5 లక్షలు, ఇతర సభ్యులకు 2.5 లక్షల ఆర్థిక సాయం, ఆయుధాలు అప్పగిస్తే అదనపు ప్రోత్సాహకాలు, అలాగే మూడు సంవత్సరాల పాటు నెలకు 10,000 స్టైపెండ్ అందించే పథకం అమల్లో ఉంది.అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో 15,189 కిలో మీటర్ల రహదారులు, 9,497 మొబైల్ టవర్లు, 47 ఐటీఐలు, 49 నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, 179 ఏకలవ్య గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశారు. అదనంగా 6,025 పోస్టాఫీసులు, 1,804 బ్యాంకు శాఖలు, 1,321 ఏటీఎంలు ప్రారంభించారు.గిరిజనుల హక్కుల పరిరక్షణలో భాగంగా 21.26 లక్షలకు పైగా అటవీ హక్కు పత్రాలు పంపిణీ చేసినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. అలాగే 2014 నుంచి 37,655 మంది గిరిజన యువత ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌లో పాల్గొన్నారని వెల్లడించింది.
హోం మంత్రిత్వ శాఖ ప్రకారం, భద్రతా చర్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, స్థానిక ప్రజలకు ఉపాధి, విద్య, ఆరోగ్య సేవలు, గిరిజన హక్కుల పరిరక్షణ, లొంగిపోయిన నక్సల్స్ పునరా వాసం వంటి బహుముఖ వ్యూహాల వల్లే దేశం నక్సలిజం ముప్పు నుంచి బయటపడగలిగిందని పేర్కొంది. ఇకపై కూడా గతంలో ప్రభావిత ప్రాంతాల్లో భద్రతను కొనసాగిస్తూ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయనున్నట్లు స్పష్టం చేసింది.

## తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు
# సుప్రీంకోర్టులో భారీ ఊరట



హైదరాబాద్, జులై 29: తెలంగాణలోని పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టు భారీ ఉపశమనం కల్పించింది. కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండంను సుప్రీంకోర్టు కొట్టివేసినా..

ఆ ఉత్తర్వు ఆధారం గా ఇప్పటికే మంజూరైన పర్యావరణ అనుమ తులన్నీ పూర్తిగా చెల్లుబాటులోనే ఉంటాయని స్పష్టం చేసింది. ఈ తీర్పు భవిష్యత్తుకు మాత్రమే వర్తిస్తుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. దీంతో తెలంగాణలో కొనసాగుతున్న ఈ కీలక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు ఎలాంటి చట్టపరమైన ఆటంకం ఉండదని స్పష్టత వచ్చింది. అదే సమయంలో భవిష్యత్తులో చేపట్టే కొత్త ప్రాజెక్టులకు ముందస్తు పర్యావరణ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని న్యాయస్థానం పేర్కొంది. కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా చట్టాలను భర్తీ చేయడం సాధ్యంకాదని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. అత్యవసర పరిస్థితుల్లో మినహాయింపులు ఇవ్వాలంటే కేంద్రప్రభుత్వం చట్టబద్ధమైన నోటిఫికేషన్ జారీ చేయాల్సిందేనని సూచించింది. ఇప్పటికే పూర్తైన లేదా నిర్మాణంలో ఉన్న కీలక ప్రాజెక్ట్ పనులకు ఎలాంటి అంతరాయం ఉండదని న్యాయస్థానం పేర్కొనడంతో తెలంగాణ ప్రభుత్వం, సాగునీటి ప్రాజెక్టులకు ఇది కీలక ఊరటనిచ్చిన తీర్పుగా భావిస్తున్నారు.

## గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు గారినీ కలసిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్



విజయనగరం, జులై 29,
గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు గారిని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు గవర్నర్ బంగ్లాలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అరగంటకు పైగా ఇష్టాగోష్టి నిర్వహించారు. భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేసిన, మీరు పునాది వేసిన భోగాపురం ఎయిర్పోర్ట్ తమరి కల మరో రెండు రోజులలో సాకారం కావడం చాలా ఆనందాన్ని కలిగిస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విమానయాన రంగంలో జిఎంఆర్ సంస్థకు మంచి అనుభవం ఉందని, త్వరితగతిన పూర్తి చేసిన జిఎంఆర్ సంస్థకు గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు గారు అభినందనలు తెలిపారు. విమానాశ్రయానికిప్రభుత్వం అల్లూరి సీతారామరాజు నామకరణం చేయటం శుభ పరిణామం అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ గారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు ప్రారంభించడం బాగున్నదన్నారుపరిశ్రమలు, రవాణా వ్యవస్థ బాగుంటే ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని ఆ దిశగా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని గవర్నర్ సూచించారు. ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గారు తదితరులు పాల్గొన్నారు.

# నోయిడా విషవాయువుల దుర్ఘటన

- ఎన్‌హెచ్ఆర్‌సీ సుమోటో
- యూపీ అధికారులకు నోటీసులు




ఆదాబ్ సైబరాబాద్, న్యూఢిల్లీ, : ఉత్తరప్రదేశ్‌లోని గౌతమ్ బుద్ధ నగర్ జిల్లా నోయిడాలో ఓ రెసిడెన్షియల్ సొసైటీకి చెందిన సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ)లో విషపూరిత వాయువులు పీల్చి పారిశుధ్య కార్మికుడు, సెక్యూరిటీ గార్డు మృతి చెందిన ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సుమోటోగా స్పందించింది. ఘటనకు సంబంధించిన మీడియా కథనాన్ని స్వయంగా పరిశీలనకు తీసుకున్న కమిషన్, జిల్లా మేజిస్ట్రేట్, పోలీస్ కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై రెండు వారాల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశించింది. దర్యాప్తు పురోగతితో పాటు, మృతుల కుటుంబాలకు ప్రభుత్వం లేదా సంబంధిత సంస్థలు ఏదైనా నష్టపరిహారం చెల్లించి ఉంటే ఆ వివరాలను కూడా నివేదికలో పొందుపరచాలని సూచించింది. మీడియా కథనాల ప్రకారం, ట్యాంకును శుభ్రం చేయడానికి ఎస్‌టీపీలోకి దిగిన పారిశుధ్య కార్మికుడు విషవాయువుల ప్రభావంతో స్పృహ తప్పాడు. అతడు బయటకు రాకపోవడంతో అతడిని రక్షించేందుకు ట్యాంకులోకి దిగిన సెక్యూరిటీ గార్డు కూడా విషవాయువుల ప్రభావానికి గురై స్పృహ కోల్పోయాడు. ఇద్దరినీ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది బయటకు తీసి ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మీడియా కథనాల్లోని వివరాలు నిజమైతే, ఇది మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన అత్యంత తీవ్రమైన ఘటనగా పరిగణించాల్సి ఉంటుందని ఎన్‌హెచ్‌ఆర్‌సీ పేర్కొంది. ఈ నేపథ్యంలో ఘటనకు దారితీసిన కారణాలు, భద్రతా ప్రమాణాల అమలు, బాధ్యులపై తీసుకున్న చర్యలు, బాధిత కుటుంబాలకు అందించిన సహాయంపై పూర్తి వివరాలను సమర్పించాలని ఉత్తరప్రదేశ్ అధికారులను కమిషన్ ఆదేశించింది.

## చెల్లూరు హైవే జంక్షన్ ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రుల బృందం



విజయనగరం, జులై 29,
ప్రధాని నరేంద్ర మోడీ గారి సభ సమావేశానికి వచ్చి తిరిగి వెళ్లే ప్రజానీకానికి భోజనాలు ఏర్పాటు చేయడం కోసం చెల్లూరు హైవే జంక్షన్ ప్రాంతాన్ని బుధవారం సాయంత్రం మంత్రులు బృందం పరిశీలించారు. మంత్రులు అచ్చం నాయుడు, అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్ధన రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి, దామచర్ల సత్య, బీద రవిచంద్ర, కిలారు రాజేష్, కోటంరెడ్డి గిరిధర్ గార్లు కలిసి హైవే జంక్షన్ ప్రాంతాలను పరిశీలించారు. జంక్షన్ ప్రాంతంలో ఉన్న ఖాళీ స్థలంలో ఎక్కువ మంది ప్రజలు భోజనాలు చేసేందుకు వీలు కల్పించి తగిన ఏర్పాట్లు చేయటానికి పరిశీలన జరిపినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో సుమారు 20 వేల మంది భోజనాలు చేయటానికి వీలు పడుతుందనే అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. మంత్రుల బృందం, అధికారులు తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని తెలిపారు.

## రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు కె.రంగరాజు కు ఘన సన్మానం

- సామాజిక తెలంగాణే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యం: కె.రంగరాజు
- స్థానిక సంస్థల బలోపేతానికి కృషి చేస్తానని హామీ



ఆదాబ్ సైబరాబాద్, వికారాబాద్: తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా నియమితులైన కె.రంగరాజు కు వికారాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ ఆవరణలో గల రవీంద్ర మండపంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా బీసీ సెల్ ఆధ్వర్యంలో బుధవారం ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కౌన్సిలర్లు, బీసీ నాయకులు మాట్లాడుతూ.. బీసీ వర్గానికి చెందిన కె.రంగరాజు పార్టీ కోసం చేసిన సేవలను గుర్తించి ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, పార్టీ అధిష్ఠానం రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా అవకాశం కల్పించడం గర్వకారణమని అన్నారు. బీసీల రాజకీయ సాధికారతకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తోందని, అందుకు రంగరాజు నియామకమే నిదర్శనమని పేర్కొన్నారు. సన్మానానికి స్పందించిన కె.రంగరాజు మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పిస్తూ, ఉద్యమకారులు, మేధావులు, పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించి సామాజిక తెలంగాణ నిర్మాణ దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, రైతు భరోసా, జాబ్ క్యాలెండర్ వంటి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తోందని కొనియాడారు. అతి సామాన్య కుటుంబం నుంచి వచ్చిన తనకు రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాజ్యసభ సభ్యుడు వేమ్ నరేందర్ రెడ్డి, పార్టీ నాయకత్వానికి జీవితాంతం రుణపడి ఉంటానని తెలిపారు. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు మల్లికార్జున్ గౌడ్, హిరేకర్ రాకేష్, మున్నూర్ పుష్పలత-శ్రీకాంత్, విజయలక్ష్మి-నాగరాజు, బీసీ నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, లక్ష్మణ్, వీరేష్, పల్లవి, యాదగిరి యాదవ్, గంగుల్ యాదవ్, నర్సిములు గౌడ్, అనంతయ్య, మంగలి శేఖర్, సంతోష్ కుమార్ ముదిరాజ్, వడ్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ జిల్లా ఐ.టి.ఐ లలో రెండవ విడత అడ్మిషన్లు..

- జిల్లా కన్వీనర్ ఎం. కనకారావు




విజయవాడ,29.07.2026.
ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని ఐ.టి.ఐ లలో 2026-27/28 విద్యా సంవత్సరానికి గాను రెండవ విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ మరియు జిల్లా కన్వీనర్ ఎం. కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ల కొరకు అర్హులైన అభ్యర్థులు ఆగస్టు 3వ తేదీ లోగా ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు ఆగస్టు 6వ తేదీన విజయవాడలోని ప్రభుత్వ ఐ.టి.ఐ ప్రాంగణంలో అడ్మిషన్ల కౌన్సిలింగ్ నిర్వహించబడుతుందని తెలిపారు. అభ్యర్థులు తమ మెరిట్ నంబర్ ఆధారంగా నిర్ణీత తేదీన తమ ఒరిజినల్ సర్టిఫికేట్లతో కౌన్సిలింగ్‌కు హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఐ.టి.ఐ లలో ప్రవేశం పొందే వారిలో ఎస్.సి., ఎస్.టి. అభ్యర్థులు మినహా మిగిలిన కేటగిరీల అభ్యర్థులు రూ. 60/- కాషన్ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని, ప్రైవేటు ఐ.టి.ఐ లలో చేరే అభ్యర్థులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజు చెల్లించాలని తెలిపారు. అభ్యర్థులు తమ మెరిట్ నంబర్ సమాచారం కోసం విజయవాడ ప్రభుత్వ ఐ.టి.ఐ లోని జిల్లా కన్వీనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను సంప్రదించవచ్చునన్నారు.
ఇతర వివరాలకు 0866-2475575, 94906 39639, లేదా 77804 29468 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని కన్వీనర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## రామ్కీ గో బ్యాక్ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

- చెత్త సేకరణ కార్మికుల హక్కులను కాపాడాలి
- గుత్తేదారుల పెత్తనం సహించం
- ప్రైమరీ కలెక్షన్ కార్మికులకే కొనసాగించాలని డిమాండ్



కుత్బుల్లాపూర్, జూలై 29:ఐడిపిఎల్‌లోని ఎల్ఎస్ ఫంక్షన్ హాల్‌లో కుత్బుల్లాపూర్ జోన్ స్వచ్ఛ ఆటో టిప్పర్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "రామ్కీ గో బ్యాక్" కార్యక్రమానికి ఎమ్మెల్సీ, ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు ప్రొఫెసర్ కోదండరాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చెత్త దేంకరణ కార్మికుల సమస్యలు, వారి ఉపాధి భద్రత, గుత్తేదారుల జోక్యంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రొఫెసర్ కోదండరాం చెత్త సేకరణ చేసే కార్మికుల పనిని ఎట్టి పరిస్థితుల్లోనూ డిస్టర్బ్ చేయరాదని స్పష్టం చేశారు. పని చేసేది కార్మికులే అయినప్పుడు, వారి శ్రమ ఫలితాలు కూడా వారికే దక్కాలని పేర్కొన్నారు. కార్మికులపై ఎవరూ పెత్తనం చెలాయించకూడదని, వారి జీవనోపాధి దెబ్బతినకుండా ప్రభుత్వం అండగా నిలవాల్సిన బాధ్యత ఉందన్నారు. గుత్తేదారుల పెత్తనాన్ని సహించేది లేదని హెచ్చరించిన ఆయన, సియంసీ పరిధిలోని ప్రైమరీ చెత్త సేకరణ వ్యవస్థను కార్మికులకే అప్పగించాలని డిమాండ్ చేశారు. చెత్త సేకరణ రంగంలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికుల కుటుంబాల జీవనాధారం దెబ్బతినకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆటో టిప్పర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కలమడుగు రాజేందర్ మాట్లాడుతూ, కార్మికుల పొట్టకొట్టే ఏ ప్రయత్నాన్నైనా తీవ్రంగా వ్యతిరేకిస్తామని తెలిపారు. కార్మికుల హక్కులను హరించే చర్యలను అడ్డుకుంటామని, వారి ఉపాధికి భంగం కలిగించే వారిని సహించబోమని హెచ్చరించారు. కార్మికుల జోలికి వస్తే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆకుల శ్రీనివాస్, స్టీఫెన్, లక్ష్మారెడ్డి, కృష్ణ,వెంకన్న, నరసింహ, రంగన్న, మల్లేష్, అంజి, జగదీష్, ఉత్తరయ్య, ప్రశాంత్, దస్తగిరి, రవి, రామకృష్ణ, అల్వాల్ శ్రీను, కుత్బుల్లాపూర్ జోన్‌కు చెందిన స్వచ్ఛ ఆటో టిప్పర్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్మికుల ఐక్యతను చాటుతూ నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతమైందని యూనియన్ నాయకులు తెలిపారు. చెత్త సేకరణ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం భవిష్యత్తులో కూడా పోరాటాలు కొనసాగిస్తామని వారు వెల్లడించారు.

# విత్తనం నాటిన ప్రతి రైతుకు ఫసల్ బీమా..!

- రైతుల ఆర్థిక భద్రతకు పథకంలో 100 శాతం నమోదు అవసరం..
- ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలి
- సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో జిల్లాను ముందంజలో నిలపాలి

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ఎన్‌టీఆర్ జిల్లా --విజయవాడతేదీ: జులై 29, 2026
జిల్లాలో రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, ప్రజారోగ్యం, వరదల నివారణ, రెవెన్యూ సేవలు, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాల్లో నిర్దేశించిన లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, జిల్లాస్థాయి అధికారులతో కలసి కలెక్టర్ కార్యాలయం నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన కింద విత్తనం నాటిన ప్రతి రైతును తప్పనిసరిగా పంటల బీమా పరిధిలోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. జిల్లాలో 100 శాతం నమోదు లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. పంట మార్పిడి (క్రాప్ డైవర్సిఫికేషన్)పై ప్రతి మండల వ్యవసాయ అధికారి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, ఇప్పటి వరకు ఎంతమంది రైతులు ఎంత విస్తీర్ణంలో పంట మార్పిడి చేపట్టారో సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఎరువుల లభ్యత, పంపిణీపై ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారులు ప్రతిరోజూ కనీసం రెండు నుంచి మూడు ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. రైతులకు సమస్యలు ఎదురైతే కలెక్టరేట్ యూనిఫైడ్ కాల్ సెంటర్ (91549 70454)ను సంప్రదించే విధంగా అన్ని ఎరువుల దుకాణాల వద్ద హెల్ప్‌లైన్ నంబర్‌ను స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. వర్షాలు ఆలస్యమైన పరిస్థితుల్లో సీడ్ పెల్లెటింగ్‌ను ప్రతి రైతుకు విస్తృతంగా అమలు చేయాలని, ఇది కేవలం ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు మాత్రమే కాకుండా అందరికీ వర్తించే సాంకేతిక విధానమని వివరించారు. సీడ్ పెల్లెటింగ్ వల్ల మొలక శాతం మెరుగుపడటంతో పాటు తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో కూడా త్తనం సురక్షితంగా ఉంటుందని తెలిపారు. రైతులకు అవసరమైన శిక్షణ అందించాలని ఆదేశించారు. హరిత విస్తీర్ణంపై దృష్టిపెట్టండి: నెట్ జీరో' లక్ష్య సాధనలో భాగంగా జిల్లాలో విస్తృత స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. మొదట సోషల్ వెల్ఫేర్ పాఠశాలలు, హాస్టళ్లలో ప్రారంభించి అనంతరం అన్ని విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు విస్తరించాలని సూచించారు. గ్రామపంచాయతీలు, పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న స్థలాలను హరితవనాలుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. జిల్లా యంత్రాంగం మొత్తం ఒకే బృందంలా పనిచేయాలని, అధికారులు తమ శాఖలకే పరిమితం కాకుండా జిల్లా అభివృద్ధి లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని సమన్వయంతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ

EDITOR PRINTER AND PUBLISHER OWNED BY BILLALPURSARA SHIVA KUMAR, PRINTING AT RIYAZ PRINTING PRESS, S NO 22-8-161, BEHIND NAYAAB HOTEL, CHATTA BAZAR, HYDERABAD, TELANGANA - 500002 AND PUBLISHED FROM H.NO: 2-1-602, TARAKARAMA NAGAR, YELLAMMABANDA, KUKATPALLY, MEDCHEL- MALKAJGIRI DIST, TELANGANA-500 072. PRGI: TGTEL/26/A4985. PHONE NO: +91 8686861338, +91 81215 50907 EMAIL : shivakumarlal@gmail.com

గురువారం,
జూలై 30, 2026

TGTEL/26/A4985
ఆదాబ్ సైబరాబాద్
ADAAB CYBERABAD



# ఖర్గే ఎం జేపీ నడ్డా- 'విద్యార్థులపై పోలీస్ చర్య' అంశంపై రాజ్యసభలో తీవ్ర వాగ్వాదం



**న్యూఢిల్లీ, జులై 29:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సం దర్భంగా రాజ్యసభలో అధికార, విపక్షాల మధ్య బుధవారం వాడివేడి చర్చ జరిగింది. నీట్ పేపర్ అక్రమాలపై గళమెత్తిన నిరసనకారులపై పోలీసు చర్యలకు సంబంధించిన అంశంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, బీజేపీ నేత జేడీ నడ్డా మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది.విద్యార్థుల నిరసనల్లో అనధికారికంగా జోక్యం చేసుకోవడం, విద్యార్థులపై లాఠీఛార్జ్? చేయడం లాంటి అంశాలను ఖర్గే రాజ్యసభలో లేవనెత్తారు. ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సభలో నినాదాల హోరులోనే మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, "నేను మిమ్మల్ని కోరుతున్నాను. అక్కడికి అనధికారికంగా వెళ్లిన వారికి శిక్ష పడాలి. వారు అసలు అక్కడికి ఎందుకు వెళ్లారు? వారికి ఎవరు ఆదేశాలు ఇచ్చారు?" అని ప్రశ్నించారు.ఖర్గే, అలాగే సపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ ఆరోపణలపై జేపీ నడ్డా తీవ్రంగా ప్రతిస్పందించారు. ఆయన పోలీసు చర్యను సమర్థించారు. దీనిని ఒక సాధారణ శాంతిభద్రతల పరిస్థితిగా అభివర్ణించారు. "నా మిత్రుడు జాన్ బ్రిట్టాస్? చెప్పినదంతా చాలా సాధారణమైన శాంతిభద్రత పరిస్థితి అని మనం అర్థం చేసుకోవాలి. నేను ఒకప్పుడు విద్యార్థి నాయకుడిని. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) రోజుల్లో నన్ను క్లాస్‌రూమ్ నుంచే చాలా సార్లు అరెస్టు చేశారు" అని నడ్డా చెప్పారు."ఇది ఒక సాధారణ పరిస్థితి. ఒక విద్యార్థి నాయకుడు దీనిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునే వారిపై పోలీసులు తగిన విధంగా చర్యలు తీసుకోవాలి. ఈ కేసుల్లో పోలీసులు ఆ ప్రకారమే వ్యవహరించాలి. ఈ కేసులో పోలీసులు ఆ ప్రకారమే వ్యవహరించారు. దీనిని కొందరు సంచలనం చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఇది పోలీసులు చేపట్టే ఒక సాధారణ శాంతిభద్రతల చర్య మాత్రమే."- జేపీ నడ్డా, బీజేపీ నేతఈ సందర్భంగా, ఎమర్జెన్సీ సమయంలో తనకు ఎదురైన అనుభవాన్ని జేపీ నడ్డా గుర్తుచేసుకున్నారు. "రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉండాలనుకునే ఏ విద్యార్థి నాయకుడైనా దీనిని ఎదుర్కోవాలి. నేను కూడా ఒకటి కాదు, చాలా సార్లు దీనిని ఎదుర్కొన్నాను. ఎమర్జెన్సీ ఉన్నప్పుడు నన్ను క్లాస్ రూమ్? నుంచే నేరుగా అరెస్టు చేశారు. ఒకసారి కాదు రెండు సార్లు. కాబట్టి ఇది చాలా సాధారణ పరిస్థితి" అని ఆయన అన్నారు. ఈ అంశంపై తీవ్ర గందరగోళం ఏర్పడిన కారణంగా, రాజ్యసభ ఛైర్మన్? సభను వాయిదా వేశారు.బ్యాక్?గ్రౌండ్ ఇదే!నీట్-యూజీ 2026 పరీక్ష పేపర్ లీక్ కావడంలో కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టింది. వీరికి ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్?చుక్? మద్దతు ప్రకటించి, నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ధర్మేంద్ర ప్రధాన్?ను కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవి నుంచి తొలగించాలని, బలవన్మరణానికి పరిహారం అందించాలని వారు డిమాండ్ చేశారు. అంతేకాదు విద్యార్థులపై నమోదు చేసి కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. కానీ మోదీ సర్కార్ దీనిపై స్పందించలేదు. ఈలోగా పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. దీనితో జులై 20న తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ, విద్యార్థులు, నిరసనకారులు జంతర్ మంతర్ నుంచి 'సంసద్ ఛలో' మార్చ్ నిర్వహించారు. పార్లమెంట్ వైపు వస్తున్న వారిని చెదరగొట్టడానికి భద్రతా సిబ్బంది ప్రయత్నించారు. ఈ క్రమంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు లాఠీఛార్జ్, బాష్పవాయువులను ప్రయోగించారు. అక్కడి నుంచి నిరసనలు మరింత ఉధృతం అయ్యాయి. నిరసనకారులకు కాంగ్రెస్, ఆప్? సహా వివిధ రాజకీయ పార్టీల నుంచి మద్దతు లభించించింది. సినీ, క్రీడా ప్రముఖులు కూడా వారికి బాసటగా నిలిచారు. పరిస్థితి శృతిమించడంతో కేంద్రం దిగివచ్చింది. సీజేపీ ప్రతినిధులతో చర్చలు ప్రారంభించింది. ఇంకా ఈ చర్చలు కొనసాగుతుండగానే, ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీమానా చేశారు. తరువాత కేంద్రం కూడా విద్యార్థుల డిమాండ్లు నెరవేర్చడానికి ఒప్పుకుంది. దీనితో 37 రోజుల పాటు సాగిన తమ నిరసనలను విరమిస్తున్నట్లు సీజేపీ ప్రకటించింది.విద్యార్థులకు ఇచ్చిన మాట ప్రకారం, కేంద్ర ప్రభుత్వం యాంటీ పేపర్ లీక్? బిల్లును ప్రవేశపెట్టింది. ఈ క్రమంలోనే జులై 20న విద్యార్థులపై లాఠీఛార్జ్ చేసిన అంశం బుధవారం రాజ్యసభను కుదిపేసింది. ముఖ్య ంగా ఇండియా కూటమి నేతలు రాజ్యసభలో మాట్లాడుతూ, విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయడానికి కారణమైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే ఖర్గే, జేపీ నడ్డాల మధ్య మాటల యుద్ధం జరిగింది.

## దేశంలో పెరిగిపోతున్న బిలియనీర్ల సంఖ్య.. ఏడాదిలో వంద కోట్లు సంపాదించిన 570 మంది



**న్యూఢిల్లీ, జులై 29:** భారత దేశంలో ధనవంతుల సంఖ్య భారీగా పెరిగిపోతోంది. ముఖ్యంగా ఏడాదికి కనీసం వంద కోట్ల రూపాయలు సంపాదించే వారి సంఖ్య పెరిగిపోతున్నట్లు కేంద్రం తాజాగా వెల్లడించింది. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో దేశంలో 576 మంది రూ.100 కోట్లు సంపాదించినట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సోమవారం పార్లమెంట్‌లో వెల్లడించింది. ఇది అంతకముందు ఏడాది.. అంటే 2024-25లో 415 మందిగా ఉండేది. అంటే ఒక్క ఏడాదిలోనే వంద కోట్ల రూపాయలు సంపాదించే వారి సంఖ్య 150 మందికిపైగా పెరిగింది.ఈ విషయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తరఫున మంత్రి పంకజ్ చౌదరి పార్లమెంట్‌లో వెల్లడించారు. పన్ను చెల్లింపు వివరాల ఆధారంగా కేంద్రం ఈ వివరాలు ప్రకటించింది. దేశంలో బిలియనీర్ల (రూ.100 కోట్లు ఆదాయం కలిగిన వారు) సంఖ్య పెరిగిపోతున్నట్లు తెలిపింది. గతంలో ఈ సంఖ్య చాలా తక్కువగా ఉండేది. ఐదేళ్లక్రితం.. అంటే 2021-2022లో బిలియనీర్ల సంఖ్య 142 మాత్రమే. అంటే, ఐదేళ్లలో బిలియనీర్ల సంఖ్య 300 శాతం పెరిగింది. 2022-2023లో 301 మంది, 2023-2024లో 284 మంది ఏడాదికి రూ.100 కోట్లు సంపాదించారు. అయితే, ప్రభుత్వం వద్ద బిలియనీర్లు అంటే ప్రత్యేకమైన నిర్వచనం అంటూ ఏదీ లేదని కేంద్రం తెలిపింది. రూ.100 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ డబ్బులు సంపాదిస్తూ, ఇన్‌కంట్యాక్స్ చెల్లించే వారి వివరాల ఆధారంగా ఈ డాటా విడుదల చేసినట్లు కేంద్రం తెలిపింది.ఇదే సమయంలో ఆర్థిక అసమానతల్ని తొలగించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. వివిధ రకాల పన్నులు విధించడంతోపాటు సంక్షేమ కార్యక్రమాల్ని కూడా చేపడుతున్నట్లు వివరించింది. అత్యధికంగా సంపాదించేవారిపై అదనపు సర్‌ఛార్జ్ వసూలు చేస్తున్నామని, మధ్యస్థాయి సంపాదన ఉన్నవారికి సాధారణ పన్నులే విధిస్తున్నామని కేంద్రం ప్రకటించింది.

## భారత్, చైనాపై 100 శాతం సుంకాలు




**న్యూఢిల్లీ, జులై 29:**రష్యాపై మరింత కఠిన ఆర్థిక ఆంక్షలు విధించే కీలక బిల్లుకు అమెరికా సెనెట్ ఆమోదం తెలిపింది. ఈ బిల్లు అమల్లోకి వస్తే, రష్యా నుంచి భారీగా చమురు, సహజ వాయువు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా వంటి దేశాలపై 100 శాతం వరకు దిగుమతి సుంకాలు విధించే అధికారం అమెరికా అధ్యక్షుడికి లభించనుంది .ఈ బిల్లును దివంగత సెనెటర్ లిండ్సే గ్రాహమ్, డెమోక్రటిక్ సెనెటర్ రిచర్డ్ బ్లూమెంటాల్ కలిసి రూపొందించారు. సెనెట్‌లో జరిగిన ఓటింగ్‌లో బిల్లుకు 86-12 ఓట్లతో మద్దతు లభించింది. అయితే ఇది ఇంకా పూర్తిస్థాయి చట్టం కాలేదు. సెనెట్‌లో మరిన్ని దశలు పూర్తి చేసిన తర్వాత ప్రతినిధుల సభ ఆమోదం పొందాలి. అనంతరం అధ్యక్షుడి సంతకం జరిగితే ఇది చట్టంగా మారుతుంది ప్రస్తుతం రష్యా నుంచి భారత్ గణనీయంగా ముడి చమురు దిగుమతి చేసుకుంటోంది. కొత్త బిల్లు ప్రకారం, రష్యా నుంచి ఇంధన కొనుగోళ్లు కొనసాగించే ప్రధాన దేశాలపై గరిష్ఠంగా 100 శాతం టారిఫ్‌లు విధించే అవకాశం ఉంటుంది. అయితే ఈ టారిఫ్‌లను ఎప్పుడు, ఏ దేశంపై, ఎంత మేరకు అమలు చేయాలన్న తుది నిర్ణయం అమెరికా అధ్యక్షుడి పరిధిలో ఉంటుంది రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ఆర్థిక ఆదాయాన్ని తగ్గించి మాస్కోపై మరింత ఒత్తిడి తీసుకురావాలని అమెరికా చట్టసభ్యులు భావిస్తున్నారు. ఈ బిల్లులో రష్యాతో పాటు ఇరాన్‌పై కూడా అద నపు ఆంక్షలకు సంబంధించిన నిబంధనలు ఉన్నాయి.

## స్మగ్లింగ్, చొరబాట్లను అడ్డుకునేందుకు కీలక నిర్ణయం




**న్యూఢిల్లీ, జులై 29:**దేశ భద్రతను పటిష్టం చేయడానికి, అక్రమ కార్యకలాపాలను అరికట్టడానికి రాజస్థాన్‌లోని జైసల్మేర్ జిల్లా యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. జైసల్మేర్ జిల్లాలోని భారత్-పాకిస్థాన్ అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఉన్న ప్రాంతాల్లో రాత్రిపూట రాకపోకలపై ఆంక్షలను నవంబర్ 30 వరకు పొడిగించింది. అంతర్జాతీయ సరిహద్దు ఉన్న 5 కిలోమీటర్ల పరిధిలో రాత్రి వేళల్లో ముందస్తు అనుమతి లేకుండా తిరగడం, సంచరించడంపై నిషేధం విధించింది. ఈ మేరకు జైసల్మేర్ జిల్లా కలెక్టర్ అనుపమ జోర్వాల్ ఉత్తర్వు జారీ చేశారు.సాయంత్రం 6- ఉదయం 7వరకు రాకపోకలపై ఆంక్షలుస్మగ్లింగ్, చొరబాటు, ఇతర సంఘ వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టడానికి జైసల్మేర్ జిల్లాలోని సరిహద్దు ప్రాంతంలో ఈ ఆంక్షలు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు అమల్లో ఉంటా యని జిల్లా అధికారులు తెలిపారు. ప్రజా భద్రత, శాంతి భద్రతలు, జాతీయ భద్రతకు సంబంధించిన ఆందోళనల దృష్ట్యా భారతీయ నాగరిక్ సురక్షా సంహిత- 2023లోని సెక్షన్ 163 కింద ఈ ఆంక్షల పొడిగింపు జరిగిందని వెల్లడించారు. సరిహద్దు ప్రాంతాల ప్రజలు ఈ ఉత్తర్వును కచ్చితంగా పాటించాలని అన్నారు. బార్డర్‌లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, కార్యకలాపాలు జరిగినా వెంటనే పోలీసులకుగానీ, సరిహద్దు భద్రతా దళం లేదా స్థానిక అధికారులకు వెంటనే తెలియజేయాలని పిలుపునిచ్చారు.పాకిస్థానీ సిమ్ కార్డులపై నిషేధంఅలాగే ఇండో-పాక్ బార్డర్‌లో పాకిస్థానీ స్థానిక సిమ్ కార్డుల వాడకంపై ఉన్న నిషేధాన్ని కూడా నవంబర్ 30 వరకు పొడిగించినట్లు జైసల్మేర్ జిల్లా అధికారులు స్పష్టం చేశారు. సరిహద్దుకు అవతలి వైపు పాకిస్థాన్‌లో ఉన్న మొబైల్ టవర్లు తరచుగా భారత భూభాగంలోకి 3-4 కిలోమీటర్ల వరకు నెట్‌వర్క్ కవరేజీని అందిస్తాయని వివరించారు. దీనివల్ల పాక్ సిమ్ కార్డుల ద్వారా కమ్యూనికేషన్ సాధ్యమవు తుందని, ఇది దేశ జాతీయ భద్రతకు తీవ్ర ముప్పును కలిగిస్తుందని తెలిపారు. అందుకే భద్రత, దుర్వి నియోగాన్ని నివారించడానికి చట్టపరమైన నిబంధనల కింద పాకిస్థానీ స్థానిక సిమ్ కార్డుల వాడకాన్ని నిషేధించామని చెప్పారు. ఈ ఉత్తర్వును ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు.పీఓకేలో ఆందోళన వేళ బార్డర్‌లో ఆంక్షలుకాగా, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అక్కడ శాసనసభ ఎన్నికల సమయంలో భారీ హింస చెలరేగింది. ఈ హింసలో నిషిద్ధ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీకి చెందిన 14 మంది ప్రాణాలు కోల్పోయారు. అలాగే పదుల మంది బార్డర్‌లో రాత్రివేళల్లో రాకపోకలపై ఉన్న ఆంక్షలను జైసల్మేర్ జిల్లా యంత్రాంగం ఈ ఏడాది నవంబరు 30 వరకు పొడిగించడం గమనార్హం.బీటలు వారిన భారత్, పాక్ సంబంధాలుఅయితే భారత్, పాకిస్థాన్ మధ్య ఇటీవల కాలంలో సంబంధాలు అంత బాగాలేవు. అందుకు ప్రధాన కారణం గతేడాది జరిగిన పహల్గాం ఉగ్రదాడే. ఈ ముష్కర దాడిలో 26 మంది అమాయక భారతీయ పర్యాటకులు మరణించారు. దీంతో ఇండియన్ ఆర్మీ ఆపరేషన్ సిందూర్ చేపట్టి పాక్, పీఓకేలో తలదాచుకుంటున్న వంద మందికిపైగా టెర్రరిస్టులకు మట్టుబెట్టింది. పాక్ చేసిన దాడి ప్రయత్నాలను సమర్థవంతంగా తిప్పికొట్టింది. దాయాది దేశ క్షిపణులు, డ్రోన్లు నెలకూల్చింది. అలాగే శత్రు దేశ సైనిక స్థావరాలను ధ్వంసం చేసింది. పాక్‌తో జరిగిన భీకర యుద్ధంలో భారత్ పైచేయి సాధించింది. దీంతో ఆఖరికి దాయాది దేశం భారత్‌తో యుద్ధం ముగింపునకు ముందుకొచ్చింది.సింధూ జలాల ఒప్పందం నిలిపివేతతమ దేశ పర్యాటకులపై దాడికి పాల్పడిన పాక్‌కు బుద్ధి చెప్పేందుకు సింధూ జలాల ఒప్పందాన్ని కూడా నిలిపివేసింది భారత్. ఈ నిర్ణయం అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. ఈ డీల్‌ను ఏకపక్షంగా నిలిపివేయడం సాధ్యమా అనే ప్రశ్నలు తలెత్తినా, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న దేశంతో సాధారణ సహకారం కొనసాగించడం సాధ్యం కాదని భారత్ వెల్లడించింది. జాతీయ భద్రతే తమకు అత్యంత ప్రాధాన్యమని పేర్కొంది. పలుమార్లు ఐరాస వేదికగా ఇదే విషయాన్ని స్పష్టం చేసింది.

# యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ గ్రీన్ సిగ్నల్



**న్యూఢిల్లీ, జులై 29:** యాంటీ పేపర్ లీక్ చట్ట సవరణ బిల్లును లోక్‌సభ ఆమోదించింది. 'వుయ్ వాంట్ జస్టిస్' అనే విపక్షాల నినాదాల మధ్య మూజువాణి ఓటుతో బిల్లుకు ఆమోదం తెలిపింది. బిల్లును జేపీసీకి పంపాలని కొందరు ఎంపీలు డిమాండ్ చేసినా, వారు ప్రతిపాదించిన సవరణలు వీగిపోయినట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. అనంతరం స్పీకర్ ఓం బిర్లా లోక్‌సభను గురువారానికి వాయిదా వేశారు. పేపర్ లీక్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి బిల్లులో నిబంధనలు రూపొందించామని తెలిపింది. రాహుల్‌గాంధీ జితేంద్రసింగ్అంతకుముందు పీఎం వో సహాయమంత్రి జితేంద్రసింగ్ యాంటీ పేపర్ లీక్ బిల్లుపై జరిగిన చర్చకు సమాధానం ఇచ్చారు. చర్చ సందర్భంగా విపక్షాలు చేసిన ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. ఇప్పటివరకు 152 సార్లు పేపర్ లీక్‌లు జరిగాయన్న కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ ఆరోపణలకు ఆధారమే లేదని అన్నారు. ప్రతిపక్ష నేత రాహుల్ వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయని జితేంద్రసింగ్ అన్నారు. రాహుల్ వ్యాఖ్యలు చూస్తే సభా సంప్రదాయాలపై ఆయనకు అవగాహన లేదని రుజువవుతోందన్నారు. రాహుల్‌గాంధీ అప్రజాస్వామిక భాష వాడారని దుయ్యబట్టారు."ప్రతిపక్షాలను చూస్తుంటే ఈ దృశ్యం చాలా నిరాశ కలిగించేలా ఉంది. ఇంతటి ముఖ్యమైన బిల్లుపై చర్చ జరుగుతున్నప్పుడు ప్రధాని మోదీ చిత్తశుద్ధితో, ఎంతో సున్నితత్వంతో ఈ బిల్లును సభలోకి తీసుకొచ్చినప్పుడు సీరియస్‌గా చర్చించి, సలహాలు ఇవ్వడానికి బదులు రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తు న్నారు. ప్రతిపక్ష నేత ప్రవర్తన చూసి నేను ఆశ్చ ర్యపోతున్నా ను. రాహుల్ గాంధీ అప్రజాస్వామిక భాష వాడారు. ఆయన వాడిన పదాలు సభా సంప్రదాయాలకు విరుద్ధమైనవి. అంతేకాదు అది ఎంతటి అన్‌పార్లమెం టరీ పదమంటే ఆ పదాన్ని నేను నా నోటితో ఉచ్చరించలేను. ఒకవేళ ఏ వ్యక్తైనా లేదా గౌరవసభ్యుడైనా తనను తాను 'ఇడియట్' అనుకున్నప్పటికీ, ఆ పదాన్ని ఇక్కడ వాడకూడదు. సభ వెలుపల వెళ్లి అనవచ్చు కానీ, సభలో అనటానికి వీల్లేదు. ప్రతిపక్ష నేతకు ఇలాంటి పార్లమెంటరీ నిబంధనల గురించి అవగాహన లేకపోవడం నాకు ఆశ్చర్యం కలిగిస్తోంది."---జితేంద్రసింగ్, పీఎంవో సహాయ మంత్రికాల్పుల ఆదేశాలను మంత్రి ఇద్దరు- మేజిస్ట్రేట్ ఇస్తారు: జితేంద్రసింగ్కాల్పుల ఆదేశాలపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను జితేంద్ర సింగ్? ఖండించారు. "కాల్పుల ఆదేశాలను మంత్రి ఇద్దరు మేజిస్ట్రేట్ ఇస్తారు. అసలు కాల్పులు జరగనే లేదు. బాష్పవాయువు ప్రయోగించారు. కాల్పులు జరగకపోతే ఆదేశాలు ఇచ్చారనే మాటకు అర్థం లేదు. హోంమంత్రి విదేశాలకు వెళ్లారని ఆరోపణలు చేస్తున్నారు. హోంమంత్రి విదేశాలకు వెళ్లినట్లు మాకెలాంటి సమాచారం లేదు. అవాస్తవాలు చెప్పి సభ నుంచి వెళ్లడం బాధ్యతాయుతం కాదు. ప్రధాని నివాసం ముందు బైఠాయించి నిరసన తెలపడం సమంజసం కాదు. ప్రధాని నివాసం ముందు నిరసన సముచితం కాదని చెప్పినా పట్టించుకోలేదు. 150 సార్లు పేపర్లు లీక్ అయ్యాయని ప్రియాంక గాంధీ ఆరోపించారు. అన్నిసార్లు పేపర్ లీక్ అయ్యాయనేందుకు ఎలాంటి ఆధారాలు లేవు. 150 సార్లు పేపర్ లీక్ వల్ల 750 కోట్ల విద్యార్థులపై ప్రభావం పడిందన్నారు. దేశ జనాభాను ప్రపంచ జనాభాతో పోల్చి ప్రియాంక చెప్పారు. ఎన్‌డీఏ హయాంలో 30 శాతం మేర ఉన్నత విద్యాలయాలు పెరిగాయి. ఎన్‌డీఏ హయాంలో 763 యూనివర్సిటీల నుంచి 1293కి పెంచాం." అని జితేంద్ర సింగ్ అన్నారు.

## 'వందేమాతరం' సవరణ బిల్లుకు రాజ్యసభ ఆమోదం.



**న్యూఢిల్లీ, జులై 29:** జాతీయ గేయం 'వందేమాతరం' గౌరవాన్ని కాపాడేందుకు ఉద్దేశించిన కీలక బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ నెల 24వ తేదీన ఎగువసభలో ఈ బిల్లును ప్రవేశపెట్టగా.. (బుధవారం) సుదీర్ఘ చర్చ అనంతరం సభ ఆమోదముద్ర వేసింది. ఇకపై వందేమాతరాన్ని అవమానించినా, లేదా ఎవరైనా ఆలపిస్తున్న సమయంలో ఉద్దేశపూర్వకంగా ఆటంకం కలిగించినా దాన్ని చట్టప్రకారం తీవ్ర నేరంగా పరిగణించేలా చట్టం చేయనున్నారు. వందేమాతరం బిల్లులో భాగంగా చరిత్రాత్మక 'ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్ యాక్ట్ - 1971' (జాతీయ గౌరవానికి భంగం కలిగించే నిరోధక చట్టం)లో కీలక సవరణలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం భారత జాతీయ గీతమైన 'జనగణమన'కు ఎలాంటి చట్టపరమైన రక్షణలు అమల్లో ఉన్నాయో.. అవే అత్యున్నత రక్షణలను జాతీయ గేయమైన వందేమాతరానికి కూడా వర్తింపజేయడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని కేంద్రం స్పష్టం చేసింది.

## మాజీ ప్రభుత్వ బస్సు డ్రైవర్ ఇంట్లో సోదాలు.. కోట్లాది నగదు, కిలోల బంగారం లభ్యం

**కోల్‌కతా:** మాజీ ప్రభుత్వ బస్సు డ్రైవర్ ఇంట్లో సోదాలు చేసిన అధికారులు షాక్ అయ్యారు. కోట్లాది నగదు, కిలోల బంగారం లభించాయి. ఈ నేపథ్యంలో నోట్ల లెక్కింపు మెషిన్‌తో ఆ డబ్బును లెక్కిస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని బీర్భూమ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ బస్సు డ్రైవర్‌గా మినార్ మోండల్ పని చేశాడు. కొన్నేళ్ల కిందట డ్రైవర్ ఉద్యోగాన్ని వీడాడు. బంధువైన స్థానిక వ్యాపారి టులు మోండల్ రాళ్ల వ్యాపారంలో సహాయం చేశాడు. ఆ తర్వాత సొంతంగా రాళ్ల వ్యాపారం చేస్తున్నాడు.కాగా, మినార్ మోండల్ అక్రమ సంపాదన, ఆస్తులపై పోలీసులు నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం అతడి ఇంట్లో సోదాలు చేశారు. రూ.5 కోట్లకు పైగా డబ్బు, 15 కిలోల తెప్పించి ఆ డబ్బును లెక్కిస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఖచ్చితమైన మొత్తం ఎంత అన్నది తెలుస్తుందని చెప్పారు.నివాసం బయట భారీగా పోలీసులను

## మనం జీవించినా.. మరణించినా దేశం కోసమే'.

**న్యూఢిల్లీ, జులై 29:** రాజ్యసభలో దేశభక్తి, 'వందేమాతరం' విశిష్టతపై టీడీపీ ఎంపీ చింతకాయల విజయ్ ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. రాజ్యసభ సమావేశాలలో భాగంగా 'నేషనల్ ఆనర్ అమెండ్‌మెంట్ బిల్లు'పై విజయ్ మాట్లాడుతూ.. ఈ క్షణం కేవలం ఓ వ్యక్తికి సంబంధించినది కాదని, ప్రజల నమ్మకానికి ప్రతీక అని అన్నారు. భారత ప్రజాస్వామ్య శక్తికి, జాతీయ ఆత్మను ప్రతిబింబించే 'వందేమాతరం' స్వరానికి ప్రతీకగా నిలిచే సందర్భమని



అని పేర్కొన్నారు. ?భారతదేశం కేవలం ఒక భౌగోళిక ప్రాంతం కాదని.. ఇది ఒక సజీవమైన సాంస్కృతిక వారసత్వమని అభివర్ణించారు. ఇది వందన, అభినందన, అర్పణ, తర్పణ భూమి అని ఉద్ఘాటించారు. దేశంలో పారే ప్రతి నది గంగతో.. ప్రతి రాయి శంకరునితో సమానమని పేర్కొన్నారు. 'మనం జీవించినా, మరణించినా ఈ దేశం కోసమే... చివరికి మన అస్థికలు గంగాజలంలో కొట్టుకుపోతున్నప్పుడు ఎవరు చెవిపెట్టి విన్నా 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' అనే శబ్దాలే వినిపిస్తాయి' అని అన్నారు.?దేశ స్వాతంత్ర్య పోరాటంలో 'వందేమాతరం' తెచ్చిన స్ఫూర్తిని, త్యాగాలను ఈ సందర్భంగా ఎంపీ విజయ్ గుర్తు చేసుకున్నారు. 1875లో బంకించంద్ర ఛటర్జీ రూపొందించిన 'వందేమాతరం' అనే రెండు పదాలు కోట్లాది మందిలో దేశభక్తిని రగిలించాయని అన్నారు. 1908లో కేవలం 18 సంవత్సరాల వయస్సులోనే ఖుదీరామ్ బోస్ ఉరికంభాన్ని ఎక్కుతూ 'వందేమాతరం' అని గర్జించారని గుర్తుచేశారు. అలాగే కాలాపానీ సెల్యులార్ జైలులో వీర్ సావర్కర్ క్రూరమైన చిత్రహింసలను తట్టుకుంటూ 'వందేమాతరం'.